# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206,

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 37 సంచిక 2

పేజీలు 40

అక్టోబర్ 2017

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................ ....... పేజీ**

భద్రవాక్యం ....................2
శ్రీబాబూజీ ఉవాచ.................... 4
అమ్మమాట.................... 7
దేవుడు - జీవుడు - ఆత్మ ................ ................9
ధ్యాన ప్రక్రియ ................ ................12
త్రిపురా రహస్యం .................... 14
ఆశ్రమ సేవ - గురు కృప .................. .......16
జీమూత వాహనుడు ............ .................... 17
అధ్యారోపము ... ..... .................... 19
సహజ సమాధి ......... ....................21
యోగవాశిష్ఠము .................... 23
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................26
పరిప్రశ్న ....................27
శకుని ............... ............... ....................29
అంజలి ....................31
శ్రీకృష్ణకర్ణామృతము....................32
సరస్వతి ............... .................... 33
శ్రీ పరమానందయ్య శిష్యులు................ 35
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....37
విష్ణు కథలు- మీరాబాయి....................39

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

పునశ్చ జన్మాంతర కర్మయోగాత్
స యేవ జీవః స్వపితి ప్రబుద్ధః ।
పురత్రయే క్రీడతి యశ్చ
జీవస్తతస్తు జాతం సకలం విచిత్రం
ఆధార మానంద మఖండ బోధం
యస్మిన్ లయం చాతి పురత్రయం చ

(కైవల్యోపనిషత్తు 14 శ్లో॥)

దేహము మూడు అవస్థలతో కూడిన పురత్రయము. మూడు అవస్థలలోనూ ఆత్మ క్రీడిస్తుంది. ఆత్మ నుండే జగత్తు ఉద్భవించింది. అంతేకాదు మూడు అవస్థలకు ఆధారము ఆత్మవస్తువే. అవస్థలు ఆత్మలోనే లయం అవుతాయి. సుషుప్తిలో దుఃఖ రహిత స్థితిని తాత్కాలికంగా పొంది, తిరిగి జాగ్రత్ స్వప్నావస్థలలోని దుఃఖములను అనుభవిస్తున్నాడు. అయితే జీవుడు అలా పొందటానికి కారణం ఏమిటి? జన్మాంతర కర్మలే దానికి కారణం అని భావించినా అలా ఎందుకు జరగాలి? అన్న విషయాన్ని సాధకుడు విచారణ చేస్తే తప్పక అవగాహనకి వస్తాడు.

ప్రాపంచికంగా ఆలోచిద్దాం. నిదురించేముందు మనం మరునాడు తెల్లవారుజామున ఏదైనా ఒక పని నిర్వహించాలని నిద్రకు ఉపక్రమిస్తే నిదురపట్టదు కదా! మనస్సులో ఆలోచనకి సంబంధించిన కలవర భావం అలజడిని కలిగించి నిదుర నుండి మేల్కొలుపుతూనే వుంటుంది. ఆ ఆలోచనలే జాగ్రత్ ప్రపంచంలో క్రియారూపం దాలుస్తాయి.

అలాగే జన్మజన్మల నుంచి ఆర్జించిన వాసనలు మనస్సులో గూడు కట్టుకుని బాహ్య ప్రపంచంలో మన అనుభవాలకు కారణం అవుతున్నాయి. జాగ్రదావస్థలో విషయ ప్రపంచాన్ని అనుభవించే జీవుడే

స్వప్న ప్రపంచంలో ద్రష్ట. అతడే సుషుప్తిలో ప్రాజ్ఞుడు. పరమాత్మను గురించిన పూర్తి అజ్ఞాన స్థితి సుషుప్తి. పరమాత్మను అన్యథా భావన చేయటం గాని, లేదా పొరపాటుగా భావన చేయటంగాని జాగ్రదావస్థలో స్వప్నము. ఈ విషయాన్ని సాధకుడు సదవగాహన చేసుకోవటానికి సోదాహరణముగా విచారణ చేయాలి. సాధకుడు తన స్వగ్రామంలో భార్య, పిల్లలతో ఆనందంగా కాలం గడుపుతున్నాడు. ఏదో పని మీద మద్రాసు వెళ్ళాడు. అక్కడ అతనిని సన్మానించారు. మరీ ఆనందపడి పోయాడు. మద్రాసులో రైలు ఎక్కి బెంగుళూరు వెళ్ళే సమయంలో జేబులో నుండి పర్సు పోయింది. చాలా దుఃఖించాడు. తిరిగి తన స్వగ్రామం చేరుకోగానే భార్య పిల్లలతో ఆనందించినవాడు, మద్రాసులో సన్మానింప బడి, అమితానందాన్ని పొందినవాడు, బెంగుళూరులో పర్సు పోగొట్టుకుని దుఃఖించిన వ్యక్తి ఒక్కరే అని గుర్తించాలి.

అలాగే జీవుడు స్థూల సూక్ష్మ కారణ దేహాలలోను, జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థలలోనూ మూడు పాత్రలను ధరించి విభిన్న అనుభూతులను పొందుతున్నాడు. అనుభవించేది, దానికి ఆధారమైనది ఒక్కటే అని గుర్తించాలి. పరమాత్మ పరంగా ఇదంతా క్రీడగా గాని, లీలగా గాని భావించవచ్చు.

కాని సాధకుని దృష్టిలో అలా కనిపించదు. సాధన పరిపక్వత చెందిన తరువాత జీవుడు సత్యంగా తోచిన విషయ ప్రపంచం అదృశ్యం అవటం వలన ఆత్మానందాన్ని అనుభవించ గలుగుతున్నాడు. ఆత్మ జ్ఞాన స్వరూపము. మనలో భావాలన్నిటికీ అదే ఆధారము.

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ 'గురువు' అంటే ఎవరు? అని శ్రీ జోగారావు గారిని ప్రశ్నించారు. ఆయన సమాధానం చెబుతూ 'గురువు సర్వాంతర్యామి సర్వవ్యాపకుడు' అని సమాధానం చెప్పారు. శ్రీ బాబూజీ మహరాజ్ "ఆకాశం కూడా సర్వత్రా వ్యాపించి వుంటుంది కదా మరి మీరు చెప్పినదానిని ఎలా సమర్థించుకో గలుగుతారు?" అని ప్రశ్నించారు. రావుగారు సమాధానం చెబుతూ 'మీరు మమ్మల్ని మాయలో పడేస్తున్నారు' అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ "గురువు అంటే ఎవరు తారకం?" అని ప్రశ్నించారు. తారకంగారు సమాధానం చెబుతూ 'గురువు సర్వవ్యాపకుడు, సర్వేశ్వరుడు, సకలశక్తి సంపన్నుడు, సకల దేవతా స్వరూపుడు, కర్త, భర్త, హర్త' అని అన్నారు.



శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "ఇంతేనా! అంటే మీరు గురుపరమాత్మకి ఒక పరిమితి విధిస్తున్నారన్నమాట. గురుశక్తి అనంతమైనది. ఆచార్యుడు అంటే ఎవరనుకున్నారు? ఉదర పోషణార్థం విద్యని అమ్ముకునేవాడనుకున్నారా? లేకపోతే పాదనమస్కారానికి వెలకట్టి ధనానికి అమ్ముడుపోయేవాడా? పోనీ మంత్రవిద్యలు ప్రదర్శించి 'ఫూ......' అని వస్తువులని అందజేసేవాడా! పిచ్చివాళ్లలారా! గురుదేవుడంటే మీ ధన ధాన్యాలకీ, పొగడ్తలకీ, వస్తువాహనాలకీ, ఆభరణాలకీ లొంగేవాడా! ఎన్నటికీ కాదు. అజ్ఞానాంధకారంలో మునిగి జాగ్రదవస్థ అనే స్వప్నంలో కలలుకంటున్న మానవుణ్ణి నిదురనుండి మేలుకొల్పి తన నిజ జాగ్రదవస్థ ఏమిటో తెలియజేసేవాడే సత్యగురువు.

మానవుడు జాగ్రదవస్థలో ఉన్నా తన నిజస్థితి ఏమిటో మరచి కదిలేదే యథార్థమని భ్రమించి, కదిలించే దానిని మర్చిపోతున్నాడు. దీనినే మరపు లేక అజ్ఞానము అంటారు. చీకటిలో త్రాడును చూచి సర్పముగా ఊహించుకుని భీతి చెందుతున్నాడు. అలాగే అజ్ఞానంలో

ఉన్న మానవుడు మృత్యువును ఊహించుకుని భయపడుతున్నాడు. చీకటిలో రజ్జు సర్పభ్రాంతిలో ఉన్న వ్యక్తికి లైటు వెయ్యగానే భ్రాంతి తొలగిన విధంగా అజ్ఞానాంధకారము లేక మరపులో ఉన్న మానవుని మేల్కొలిపి తన నిజ జాగ్రదవస్థని తెలియజేయగానే మృత్యుభయం తొలగిపోతుంది. దీనినే 'ఎరుక' అంటారు.

కాషాయదండ మాత్రేన యతిః పూజ్యో న సంశయః అన్నట్లుగా ముండిత శిరస్సూ, కాషాయ వస్త్రములూ, రుద్రాక్షమాలలూ, కమండలమూ, దండమూ ధరించిన వారెవరైనా గౌరవింపబడతారు. అంతమాత్రంచేత వారిని సత్య గురువులుగా పరిగణింపరాదు.

శ్రీకృష్ణపరమాత్ముడు తనను విడిచి గోపికలు ఉండలేక పోతున్నారని, వారు తనరూపాన్ని దర్శించి ఆనందించి సగుణారాధనకే పరిమితమౌతున్నారన్న మరుక్షణం తాను అదృశ్యమై నిర్గుణతత్త్వాన్ని అలవరచాడు. గోపికలు వారి భక్తిలో ఏమాత్రం మార్పులేక ధన్యులైనారు. మరి మీరంతా నన్ను దర్శించకుండా ఉండలేకపోతున్నారు.

నా దర్శనం పొందని రోజు మీరు పొందే మనోవేదన నేను భరించలేక పోతున్నాను. సగుణంలో ఉన్న ఇబ్బంది ఇదే. దీనికేదైనా పరిష్కారమార్గం చూడాలి. అయినా ఆవిషయం మనకెందుకు? జగజ్జనని చూసుకుంటుంది. నేను వచ్చినపని అయిపోయింది. ప్రాపంచిక కోరికలతో ఉన్నవారికి కావలసిన ఏర్పాట్లుచేశాను. నా శక్తినంతా ధారపోసి దేవతామూర్తులను ప్రతిష్ఠచేశాను. భక్తుల కోర్కెలు తీర్చటానికి సీతాలక్ష్మణాంజనేయ సహిత శ్రీరామచంద్రుడూ, మహాకాళికా పరమేశ్వరీ, శ్రీరామలింగేశ్వరుడూ రాధాకృష్ణ యుగళ మూర్తులూ ప్రతిష్ఠింప బడియున్నారు, గ్రహశాంతి నిమిత్తం నవగ్రహదేవతా మూర్తులూ ఉన్నారు. సంతాన ప్రాప్తికి గోదీక్షలూ, పుట్టదీక్షలూ ఏర్పాటుచేశాను. అలాకాకుండా కేవలం భక్తిభావనతో ఆశ్రమవాసం చేసేవారికి ఏలోటు రాకుండా తగిన ఏర్పాటు చేశాను.

ఆశ్రమాన్ని నమ్ముకున్న చీమకైనా మా జగజ్జనని లోటు రానిస్తుందా? ఇంతవరకూ నా కాలాన్నంతా ప్రాపంచికమైన కోరికలను తీర్చుకోవడానికి వచ్చిన భక్తులకోసం వినియోగించాను. ఇకముందు అటువంటి వారెవరైనా ఉంటే నేను ఏర్పరచిన దేవతామూర్తులను సేవించి మీ కోర్కెలను సాఫల్యం చేసుకోండి. మీకు ఏదైనా భక్తిభావంతో నావద్ద పొందాలని ఉంటే నాకభ్యంతరములేదు. అటువంటి వారికి ఎంత

కాలాన్నైనా వినియోగించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇంతవరకు నేను చేసిన బోధ థియరీ. ఇకముందు మీరు పొందబోయేది ప్రాక్టికల్ దీనిని గుర్తించండి.

సమర్ధ సద్గురువులు అన్నా లేక సత్యగురువులన్నా థియరీ ప్రాక్టికల్ రెండూ తెలిసినవారు. థియరీ మాత్రమే తెలిసినవారు పండితులూ లేక శాస్త్రకారులు. వారు చదివిన గ్రంథాలలోని విషయాలను ఎంతో అనుభవమున్నవారిలాగా ఇతరులకు తెలియజేయవచ్చు. అలాగే ప్రాక్టికల్ మాత్రమే తెలిసిన మహాత్ములు ఆత్మానందాన్ని పొందుతూ ఉండవచ్చు కానీ ఆ ఆనందాన్ని ఇతరులకు అందింపజాలరు. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. ఒక వ్యక్తి తనకు లభించిన మామిడిపండును తానే భుజించి ఆనందిస్తాడు. అలాగే కొంతమంది మహాత్ములు ఆత్మానందాన్ని పొందుతూ తామే ఆ ఆనందసాగరంలో ఓలలాడుతూ ఉంటారు. వారు మహాత్ములే. వారే ప్రాక్టికల్ మాత్రమే తెలిసిన మహాత్ములు. మరికొంతమంది తమకు లభించిన మామిడి పండులోని టెంకెను, రసాన్ని ఇతరులకు అందజేసి వారిని ఆనందింప చేస్తారు. తాము మాత్రము ఆ పండులోని బాహ్యకవచాన్ని మాత్రమే స్వీకరించి సంతృప్తిపడతారు.

ఈ కోవకు చెందిన మహాత్ములు తాము పొందే ఆత్మానందాన్ని మధురమైన బోధల రూపంలో తమను ఆశ్రయించిన వారికందజేసి తరింపజేస్తారు. మామిడిపండులోని టెంక, రసము మధురముగా వుంటాయికదా! అలాగే మహాత్ములు అందజేసే బోధలు మధురాతి మధురంగా వుంటాయి. ఈ కోవకు చెందిన మహాత్ములే థియరీ, ప్రాక్టికల్ తెలిసిన సత్యగురువులు, మానవుడు తరించడానికి సత్యగురువును ఆశ్రయించాలి. ఆయన మానవ జీవిత లక్ష్యాన్ని తెలియజేయగల్గుతారు. అది ఆయన సబ్జెక్టు కాబట్టి. ఒక బాటనీ లేక ఫిజిక్స్ తెలిసిన వ్యక్తి బిల్డింగ్ కడితే ఎలావుంటుంది? బిల్డింగ్ కట్టేపని ఇంజనీర్ చెయ్యాలి. అలాగే ఎవరి సబ్జెక్టు వారిదే. సత్యగురువు కాంతాకనకములపై ఉన్న వ్యామోహమనే అజ్ఞానాన్ని తొలగిస్తాడు. నువ్వు సాధకుడిగా ఉన్నప్పుడు మర్కట కిశోరన్యాయముగా వ్యవహరించే నీ మనస్సును ఆయన ఆధీనములోనికి తీసుకుని మార్జాల కిశోరన్యాయముగా వ్యవహరించేలా చేస్తాడు" అన్నారు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

"అత్యంత దుర్లభమైన మానవ జన్మ వచ్చినందుకు దానిని సార్థకం చేసుకోవడానికి మనం చేసే ప్రయత్నమే 'సాధన' అని పిలువ బడుతుంది. సాధన సరిగా జరగాలి అనుకుంటే భావశుద్ధి కావాలి. ధ్యానమనేది ఆ సాధనలో ఒక ప్రక్రియ. ఎలా చేయాలో మనకు మార్గదర్శకత్వం వహించే గురువు చాలా ముఖ్యము. ధ్యానం అనేది మనకు భిన్నం కాదు; దానిని ఇష్టంగా చేసుకోవాలి. మన సాధనకు అంతరాయం కలిగించేది మన మనస్సే. కాని బయట విషయాలు కావు. కాబట్టి క్రమంగా సాధన చేయగా చేయగా ఆ మనస్సు మన కంట్రోల్‌లోకి వస్తుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ధ్యానమంటే మన యింటికి మనం వెళ్ళడమే. అంటే మనం ఏ పరమాత్మ వస్తువు నుంచి వచ్చామో తిరిగి ఆ పరమాత్మ వద్దకు చేరుకోవటానికి చేసే ప్రయత్నమే 'ధ్యానము'. అలాగని ఇదేదో మరణించాక వచ్చేది మాత్రం కాదు. మనం జీవించి వుండగానే ఆ పరమాత్మ ఆనందాన్ని అనుభవించాలి.



సాధకుడయినటువంటివాడు రాగద్వేషాలు, ప్రియాప్రియాలు, ఇష్టాయిష్టాలు మొదలైన ద్వందాలను రహితం చేసుకోవాలి. నేను చేస్తున్నాననే అహంకారాన్ని వదిలివేయాలి. అంతా భగవంతుడే చేయిస్తున్నాడు అనే భావన కలిగిననాడు, భగవంతుడు మన చేత ఎట్టి తప్పుడు పనీ చేయనివ్వడు. సాధకులు ఎప్పుడూ పరవిమర్శ చేయకూడదు, వారు నిరంతరం ఆత్మవిమర్శ చేసుకోవాలి. సాధకుడు కోరుకోవలసినదల్లా 'నీ పాద కమలసేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును, నితాంత అపార భూతదయయును తాపస మందార మాకు దయసేయగదే' అని.

పూజ, జపము, ధ్యానము, పారాయణ, సంకీర్తన, సంఘసేవ, భక్తులసేవ, సద్గ్రంధ పఠనము, సాధుజనులతో సాంగత్యం, సత్సంగం,

సద్విచారణ - ఇవన్నీ కూడా సాధన యొక్క అంగములే. ఫలాపేక్ష లేకుండా చేసిన ప్రతిపనీ సేవా, నిస్స్వార్థ సేవ, నిష్కామసేవ గానే పరిగణింప బడుతుంది. దీనినే కర్మలో అకర్మ అంటారు. ఇది చేయడం ద్వారా మనస్సు శుద్ధి అవుతుంది.

ఇక 'పూజ' అంటే ఏమిటో చూద్దాం. పూజ అనేది మనలో ఒక పవిత్ర భావనను ఉద్దీపింపజేస్తుంది. దేవుడికి పూజ చేయడమంటే వేరే ఎవరికో చేయడం కాదు. నీలోనే వుండి నిన్ను నడిపిస్తున్న అనంత శక్తిని మేలుకొలపడమే పూజ; అదే ప్రార్థన.

బాహ్యంగా పువ్వులు, పండ్లు మొదలైనవి సమర్పించేది 'సామాన్య పూజ'. మనస్సులో మానసికంగా చేసే పూజ 'విశిష్ట పూజ'. మన పంచ జ్ఞానేంద్రియాలను, పంచ కర్మేంద్రియాలను మనో బుద్ధి చిత్తాహంకారాలనే అంతరేంద్రియాలను భగవదున్ముఖం చేయడానికి బాహ్యపూజ సహకరిస్తుంది. ఎన్ని సేవలు, ఎన్ని పూజలు చేసినా మనస్సు భగవంతునిపై ఎంత సేపు నిలిచింది అన్నదే ముఖ్యము. 'సాధన' అనేది మనకన్నా భిన్నంగా లేదు. నీ గురించి నీవు వెదుక్కునే మార్గమే సాధన. నీ జీవితానికి ఆధారమెవరో గుర్తించడమే సాధన.

సాధనకి అత్యంత ఆవశ్యకమైనది సత్సంగము. బాహ్యపూజలు చేయటంవలన కాయశుద్ధి జరుగవచ్చు. కానీ మనస్సు శుద్ధి చెందాలంటే సజ్జన సాంగత్యము, గురుబోధా శ్రవణము, నిరంతరం విన్న గురుబోధను మననం చేసుకోవడం, సద్వస్తు విచారణ జరిగితీరాలి.

దానికి కావలసిన సాధన సంపత్తిని, అఖండ భక్తిజ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా మనందరినీ కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# దేవుడు - జీవుడు - ఆత్మ

- పాలూరి కాళీప్రసాద్

సీతారాములిద్దరూ హనుమంతులవారికి తమ నిజతత్వాన్ని సవిస్తరంగా తెలయజేసిన తరువాత, శ్రీరాముడు పరీక్షగా "హనుమా! చెప్పు, నీవెవరు?" అని అడిగాడు. అప్పుడు హనుమంతుడు 'దేహబుద్ధ్యా తవ దాసోzహం, జీవబుద్ధ్యా త్వదంశకః, ఆత్మబుద్ధ్యా త్వమేవాzహం' అని సమాధానం చెప్పాడు. అసలు ఈ మూడు ఏమిటో, వాటి మధ్య వ్యత్యాసం ఏమిటో చూద్దాం.

పంచ భూతాలతో నిర్మితమై, మనకంటికి కనిపిస్తూ, ఇతర జ్ఞానేంద్రియాలతో అనుభూతమవుతూ వుండే ఈ స్థూల శరీరమే దేహం. ఇక మన ఆలోచనలు, సంకల్పాలు, జ్ఞాపకాలు, కోరికలు, కర్మలు, వాసనల సమాహారమే జీవుడు. విశ్వవ్యాపకమై తాను కదలక, సమస్త సృష్టినీ కదిలిస్తూ వుండే చైతన్యమే ఆత్మ.

సాధారణంగా మనం 'నేను' అని ఈ దేహాన్ని సూచిస్తూ మాట్లాడతాం. అదే దేహబుద్ధి. ఈ దేహం నేను అనుకున్నంత కాలమూ మనం దాసులమే, రాముడు ప్రభువే. అలా కాక, ఈ దేహంలో సూక్ష్మరూపంలో వుంటూ ఈ దేహం చేసే క్రియలన్నిటికీ ఆధారభూతమై, వాటిని కర్మలుగా, వాసనలుగా అంటించుకునే జీవుడు 'నేను' అని భావించినప్పుడు ఆ జీవుడు దేవుడి నుండే వచ్చాడు కాబట్టి 'నేను నీ అంశను' అనగలుగుతాము. ఆ జీవ బుద్ధిని కూడా దాటి సర్వే సర్వత్ర నిండి యున్న ఆత్మను 'నేను' అని గుర్తించిననాడు 'త్వమేవాహం' అనే స్థితికి చేరుకుంటాము.

ఇంకా కొంచెం లోతుగా వెడితే - మనం ఒక బంగారం కొట్టుకు వెళ్ళామనుకోండి. అక్కడున్న నగలన్నీ చూస్తూ అందులో ఏవి కంటికి అందంగా కనిపిస్తున్నాయి, ఏవి మన ఒంటిపై నప్పుతాయి అని చూస్తాం. అదే ఆ కొట్టు యజమాని మాత్రం, ఏ నగ ఎంత బరువు వుంది, అది అమ్మితే తనకు ఎంత లాభం వస్తుంది అని మాత్రమే చూస్తాడు. అతనికి నగల అందం గురించి పట్టదు. అతనికి ఆ నగలన్నీ బంగారం లాగే కనిపిస్తాయి. ఇదే దేహబుద్ధికి, జీవబుద్ధికి తేడా. అలాగే మనం రంగురంగుల గ్లాసుల్లో పాలుపోసి, టేబుల్ మీద పెట్టాం అనుకోండి.

ఇంట్లో చిన్నపిల్లలు 'నాకు ఈ రంగు గ్లాసు కావాలంటే, నాకు ఆ రంగు గ్లాసు కావాలని' కొట్టుకుంటారు. అదే పెద్ద వాళ్ళు గ్లాసుది ఏ రంగైనా లోపల పాలు ఒకటే కదా అనే భావనలోనే ఉంటారు.

మనకు దేహబుద్ధి పోనంత కాలం, ఇతరులను కూడా ఆ బుద్ధితోనే చూస్తాం. అందుకే ఒక కొత్తమనిషిని చూడగానే అతని ఆకారాన్ని బట్టో, వేషభాషలను బట్టో, రంగుని బట్టో ఠక్కున ఒక అంచనాకు వచ్చేస్తాం. అది ఎంత తప్పో వారితో కొంతకాలం గడిపితేకానీ తెలియదు. అదే దేహబుద్ధిని దాటి జీవబుద్ధిని అందుకున్నప్పుడు మనం పైపై ఆకార వికారాలకు మోసపోక, ప్రతి జీవిని వారివారి మనస్తత్త్వాలను బట్టి, గుణగణాలను బట్టి మాత్రమే అంచనా వేస్తాము. నగలు ఎన్ని రూపాలలో ఉన్నా, వాటిని చేసిన బంగారం నాణ్యత ముఖ్యమైనట్లు, అలాగే గ్లాసులు ఎన్ని రంగుల్లో ఉన్నా, వాటిలోని పాల రుచి ముఖ్యమైనట్లు పైకి కనబడే దేహాలు ఎలా వున్నా, వాటిలోని జీవుల సంస్కారం ముఖ్యమని గుర్తిస్తాము.

అయితే దీనిని కూడా దాటిన మహాత్ములు సర్వమూ ఆత్మ మయంగా గుర్తించి, తమకూ చుట్టూ వున్న ప్రపంచానికి ఏ మాత్రమూ భేదం లేదనే ఎఱుకను కలిగి వుంటారు. వారికి కనీసం గ్లాసులో వున్నవి పాలో, నీళ్ళో, విషమో అనే భేద దృష్టి కూడా వుండదు. అలాగే తాము ధరించినవి బంగారు నగలో, యిత్తడి నగలో, చిరిగిన గుడ్డలో అనే దృష్టి కూడా వుండదు. ఎదుటి వ్యక్తి ఆకార వికారాలుగానీ, ఉచ్ఛ నీచ సంస్కారాలుగానీ, వారిపట్ల ఎటువంటి ప్రభావం చూపలేవు. వారు సదా తమలోనే సర్వప్రపంచాన్నీ, అలాగే సర్వ ప్రపంచంలోనూ తమను దర్శిస్తూ వుంటారు. అదే ఆత్మ దృష్టి, అద్వైత దృష్టి.

అయితే ఎంతటి అద్వైతాన్ని సాధించినా, గురుదేవుల సన్నిధిలో మాత్రం ఎప్పుడూ మనలను మనం దాసుడిగానే భావించాలి. 'నాఽద్వైతం గురుసన్నిధౌ'. అందుకే ఒక కవిగారు హనుమంతుని భక్తిని వర్ణిస్తూ ... "కనుల నిండా ఇనవంశసోముడు కదలాడుచుండినా, యెడదలోన శ్రీరఘురాముడు నడయాడుచుండినా, తనివి తీరక, తృప్తి కలుగక ఎదుట చూడాలని, పదముల వ్రాలాలని వేచి నిలిచేవా! ఎదురు కాచి కొలిచేవా!' అని కీర్తించారు.

# శుభాభినందనలతో..... ........



INDIGENEOUS anadig MAKE
CAKT-02, CAKT-05, CAKT-06 & TAK-011-03
ENGINE ROOM INSTRUMENTATION FOR EKM SUBMARINE
INDIGINOUS INTRUMENTS FITTED ON
• INS SINDHUKESRI
• INS SINDHUGHOSH
• INS SINDHUSHSTRA
• INS SINDHURAJ
• INS SINDHUKIRTI
• INS SINDHUVIR
• INS SINDHUVIJAY
anadig systems

# ధ్యాన ప్రక్రియ

(శ్రీ మాతాజీవారి బోధల నుండి)

- రమణ ప్రసాద్

(ఆగస్టు 18 నుండి 24 వతేదీ వరకు శ్రీకాళీవనాశ్రమంలో మౌన ధ్యాన సప్తాహ శిబిరం పూజ్యశ్రీ మాతాజీ వారి అనుగ్రహంతో నిర్వహింపబడినది. ఆశ్రమవాసులే కాక పలుచోట్లనుంచి ఎందరో భక్తులు వచ్చి ఈ శిబిరంలో పాల్గొన్నారు. శ్రీమాతాజీవారు, గురు సోదర, సోదరీమణులు ఈ సందర్భంగా ప్రసంగాలు చేశారు.)



శ్రీమాతాజీ మాట్లాడుతూ, "ధ్యానం కళ్ళు మూసుకుని చేసే ప్రక్రియ అని చాలామంది అనుకుంటారు. శ్రీ బాబు జనరేటర్ తిరిగినంత స్పీడుగా జపం చేయాలన్నారు. అయితే జపం చేసే నామంలో మనస్సు నిలిచిపోవాలి. మనకు కావలసింది 'క్వాలిటీ' గాని 'క్వాంటిటీ' కాదు. ఒక్కసారి, 'ఓం నమశ్శివాయ' అంటే ఆ పరమేశ్వరునిపై మనస్సు నిలిచిపోవాలి.

ధ్యానంలో ముందు దృష్టి నామం పైన నిలుపు. ఆ మూర్తి, వీక్షణ, తేజస్సు, అనుగ్రహం నీ మనోవీధిలో తిలకించు. ఆ తరువాత మెల్లగా గురుబోధ మీద దృష్టి సారించు. అట్టి ఫలితం పొందాలంటే మనస్సు నిర్మలం కావాలి. విషయాదుల నుండి మనస్సును అంతర్ముఖం చేయాలి. ఈ ధ్యాన ప్రక్రియ ఇష్టంగా, ఉత్సాహంగా చేయాలి. 'ధ్యానానికి ధీరునివలె కూర్చోవాలి' అన్నారు శ్రీబాబు. రెండు పూటలా ధ్యానం చేయాలి. బ్రాహ్మీ ముహూర్తంలో ధ్యానానికి కూర్చుంటే తప్పకుండా మనస్సు నిలుస్తుంది. ఎందుకంటె అప్పుడు మన మనస్సు విషయాదులపైన వుండదు కాబట్టి.

హృదయంలో నిలుపుకొన్న ప్రభువుని తిలకించు. **'కానివి పోనివి కర్మముల్ జేసి కాలునిబారిని పడెదవేలరా । కాళీ ప్రసాదుని హృదయనివాసీ । శ్రీమన్నారాయణ పాద ధ్యానము మరవకుమురా,మరవకుమురా । పాపహరణమురా ఇది నిక్కమురా- మాయాలోకమురా జీవా, మమతలలో పడెదవేలరా ।'**

ఇది గురు ప్రసాదిత కీర్తన. మనకి గురుగీత ఆచరణీయము. సద్భావన పెంపొందించుకోండి. దుష్కర్మలు చేయకండి. సత్కర్మలు చేయండి. కాలం వెళ్ళిపోతోంది. ధ్యానము, ధ్యాత, ధ్యేయము - ఈ మూడూ వేరు కాదు. ఒకటే. ఆ స్థితిని పొందింపజేసేది సద్గురుపాదం మాత్రమే. నీ భావన, నీ దేవుని యందు నిలిచిపోవాలి. ఆంజనేయుడు ఒక సారి 'రాం' అంటే శరీరంలోని 33కోట్ల రోమాలు 'రాం' అనేవి. మనకేమైనా తక్కువా? బృందావనంలో కూర్చుని హాయిగా ధ్యానం చేస్తున్నాం. నామం కోట్లు, లక్షలు చేయనక్కర్లా. లక్ష్యం ఉంటే చాలు. శ్రీగురుదేవులు మనని చేయి పట్టుకుని నడిపిస్తున్నారు. అది గుర్తించండి. శ్రీ గురుదేవుని కృపకు మనమందరము పాత్రులమవుదుము గాక! సుఖీ భవ! సుఖీభవ!!"

---

## విన్నపము

సమర్థ సద్గురు తెలుగు మ్యాగజైన్ పాఠకులకు సవినయ విన్నపము

ఇటీవల పేపర్ ఖర్చులు, ప్రింటింగ్ ఖర్చులు విపరీతంగా పెరగటం వల్ల సమర్థ సద్గురు యాజమాన్యం ఈ క్రింది నిర్ణయాలు తీసుకున్నది:

1. లైఫ్ మెంబర్స్‌గా 20 సంవత్సరాల పైగా ఉన్న వారు తిరిగి రూ.1,116/- కడితే వారికి 20 సంవత్సరాలు ఈ మాస పత్రిక పంపుతాము. కాబట్టి వారిని వెంటనే ఈ మొత్తం కట్టమని ప్రార్థిస్తున్నాము.

2. యాన్యువల్ మెంబర్స్‌ని కూడా రూ.1,116/-కట్టి లైఫ్ మెంబర్స్‌గా మారమని కోరుతున్నాము.

3. ఈ ఆధ్యాత్మిక మాస పత్రికాభివృద్ధి కోరే దాతలను రూ.11,116/-కట్టి మహారాజపోషకులుగా, రూ. 5,116/- కట్టి రాజపోషకులుగా చేరమని వేడుకుంటున్నాము.

4. మీ బంధు మిత్రులను, తోటి సహాధ్యాయులను సభ్యులుగా చేర్చమని కోరుతున్నాము.

ఈ చందా రుసుము YSCKPM CHARITABLE TRUST - SAMARDHA SADGURU MAGAZINE A/C పేరుమీద MO/DD/Cheque గాని తీసి పంపించ ప్రార్థన.

సమర్థ సద్గురు యాజమాన్యం

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి) **జ్ఞాన ఖండం** - రమణ ప్రసాద్

"నాధా! సూక్ష్మదృష్టితో పరిశీలించు. జ్ఞానం అంటే ఆత్మ. జ్ఞేయం అంటే ప్రపంచం. జ్ఞానం ఇంద్రియ గ్రాహ్యం కాదు. అది స్వయం ప్రకాశం. ఘటాదులు ప్రకాశించటానికి దీపాదులు అవసరమైనట్లుగా జ్ఞానం ప్రకాశించటానికి ఏదీ అక్కర లేదు. ఈ జ్ఞానజ్యోతి లేనిచో ప్రపంచమే లేదు. రాజపుత్రా! కుండ మొదలైన వాటిలో మట్టి ఉన్నట్లుగా జగత్తులోని వస్తువులలో ఉన్నది చైతన్యమే. అదే నీ ఆత్మ స్వరూపమని తెలుసుకో!



పరచితి అంటే చైతన్యమే. అనగా స్వాత్మ. స్వాత్మను తెలుసుకుంటే ఆమెను (త్రిపురామాత) తెలుసుకోగలవు.

ఆత్మను చూడటానికి నువ్వు చిరకాలం ప్రయత్నించనక్కరలేదు. క్షణకాలం నీ మనస్సును బాహ్యవస్తువులపై వెళ్ళకుండా ఆలోచించు. 'వున్నాను' అనే శుద్ధమైన భావనతో నీ ఆత్మను చూడు. అప్పుడు పుట్టిన శిశువు 'ఉన్నాను' అనే స్ఫూర్తితో మాత్రమే ఉంటాడు. ఈ భావన 'నేను జడ పదార్థాన్ని కాను' అని సూచిస్తుంది. అంతర్ముఖుడు ఆ విధంగా భావించుకోవాలి.

మరి మనస్సును ఎలా నిగ్రహించాలి? బాహ్య వస్తువులపై పరిగెడుతున్న మనస్సును అంతర్ముఖం చెయ్యి. 'నేను చూస్తున్నాను' అనే భావం కూడా ఉండకూడదు. గ్రుడ్డివాని వలె నుండుము. మనస్సును నిస్సంకల్పము చేయుము. 'చూచుచున్నాను' అనే భావం ఉన్నంత వరకు ఆత్మానుభవం లభించదు. జాగ్రత్ స్వప్న దశలలో భాసించు దర్శనాన్ని (జ్ఞానరూపాన్ని) సుషుప్తిలో మూఢాత్మకంగా భాసించే జ్ఞానరూపాన్ని (అదర్శనాన్ని) వదలి, ఏ రూపమూ, ఏ అవస్థా లేని, అన్నిటిలో ఉన్న నీ నిజరూపాన్ని గుర్తించు. అప్పుడు ఏది మిగులుతుందో అదే నీవు.

## 10వ అధ్యాయము

హేమచూడుడు మామూలు స్థితికి వచ్చి ప్రియురాలిని, బాహ్య జగత్తును చూశాడు. సామాన్య చైతన్యంలో అతనికి ప్రశాంతి కలిగింది. అట్టి విశ్రాంతిని మళ్ళీ  పొందాలని కళ్ళు మూసుకున్నాడు.

హేమలేఖ - నువ్వు కళ్ళు మూసుకుంటే నీకు ఏమి లాభం కలిగింది? కనులు తెరిస్తే ఏం నష్టం కలిగింది?

హేమచూడుడు - చాలా కాలం తర్వాత నేను విశ్రాంతిని పొందాను. అన్న పానాది బాహ్య వ్యవహారములు రసహీనములైనాయి. తన వద్దనే ఉన్న ధనరాశిని ఎరుగని బిచ్చగాని వలె నాలోనే ఉన్న సుఖ సముద్రాన్ని గుర్తించలేక పోయాను. ప్రియురాలా! నాపై దయ ఉంచి సుఖరూపమైన, నాలోనే ఉన్న సమాధి సుఖము (విశ్రాంతి)నాకు కలుగచెయ్యి.

ఈ మాటలు విని హేమలేఖ చిరునవ్వుతో ఇలా అన్నది- నాధా! ఆ సామాన్య చైతన్యము నీకు కలుగలేదు. 'అది నేనే' అనే అనుభవం నీకు కలుగలేదు. నీకు సామాన్య చిద్రూపం కొంతవరకే తెలిసింది. కనురెప్ప మూస్తే లభించేది కాదు. అది పూర్ణము, సత్యము కాదు. సామాన్య చైతన్య రూపాన్ని గురించి చెబుతున్నాను విను

- దేహమే ఆత్మ అనేది ఒక గ్రంధి (ముడి). ఆ ముడి విడిపోనంత వరకు స్వాత్మైక రూప సుఖం కలుగదు. అజ్ఞానం అనే త్రాడును కోయాలి. అప్పుడే దేహాత్మ అనే ముడి విడిపోతుంది. అది పోతే కాని సుఖ దుఃఖ రూపమైన సంసారం పోదు.  ఆత్మ దేశ కాలాదులతో పరిమితం కాదు. సర్వత్ర ప్రకాశిస్తున్న ఆ సంవిత్తును కళ్ళు మూయుగానే హృదయకుహరంలో చూడాలి. ఆ పరమ చైతన్యం కల్పనా రూపమైన జగత్తును తనలో లీనం చేసుకుంటుంది.

మనసును నిగ్రహించి 'నేను నా హృదయంలో ఉన్న ఆత్మను చూస్తున్నాను' అనే గ్రంధిని కూడా కోసెయ్యి. మనస్సును నిరోధిస్తే స్వాత్మ ఎలా భాసిస్తుందో, కళ్ళు తెరిచినా  దృశ్య ప్రపంచంలో భాసించేది కూడా పరిశుద్ధమైన ఆత్మయే. చైతన్యం వల్లనే కదా ప్రపంచం భాసించేది. అందువల్ల జగత్తుకూడా శుద్ధ చైతన్యమే. కాబట్టి అంతటా అఖండమైన, బ్రహ్మానందరూపమైన ఆత్మను చూడు. అద్దంలో ప్రతిబింబం లాగా నీలోనే సమస్త లోకాలన్నీ చూడు.

-సశేషం

# ఆశ్రమ సేవ - గురు కృప

- గాలి జగదీశ్

ఒక నగరంలో ఒక షావుకారి కుమారుడు గురుకృపను పొందాలని ఒక ఆశ్రమంలో ఒక సద్గురువుని ఆశ్రయిస్తాడు. మొదట్లో కొన్ని యిబ్బందులు ఎదురయ్యాయి.

చీపురుతో ఆశ్రమం అంతా ఊడ్చి, కళ్ళాపుజల్లి శుభ్రం చేసేవాడు. ఆశ్రమంలో సమారాధన జరిగినప్పుడు ఆ వంటగిన్నెలు అన్నీ స్వయంగా బూడిదతోగానీ, మట్టితోగానీ తోమేవాడు. చేతులు అన్నీ గీరుకుపోయి, రక్తం కారుతూ ఉండేది. చూసేవారికి ఇదంతా బాధ కలిగించేది. చేతులు కొట్టుకుపోయినా సరే పట్టీలు వేసుకుని చేసేవాడు.

ఇలా ఆశ్రమంలో అన్ని సేవా కార్యక్రమాలలోనూ శారీరక బాధను లెక్కచేయకుండా సేవ చేసేవాడు. తీరిక సమయాలలో గురువుగారు బోధామృతాన్ని ప్రసాదించేవారు. పడిన కష్టాలన్నీ మరచిపోయి, ఎంతో ఏకాగ్రతతో బోధను శ్రవణం చేసి, ఆనందాన్ని అనుభవించేవాడు. అదంతా శ్రీ గురుకృపయే!

సాత్విక గుణం - మొదట కొంత కష్టంగా ఉంటుంది. కానీ తరువాత దాని ఫలం ఎంతో తియ్యగా ఉంటుంది.

రజో గుణం - మొదట సుఖంగా ఉంటుంది. కానీ తరువాత దాని ఫలం కష్టాలపాలు చేస్తుంది.

తమో గుణం - మొదట, తరువాత కూడా ఆందోళనగానే వుంటుంది. దాని ఫలం ఘోరనరకం! అజ్ఞానం!

***సర్వమతముల సారము ఒక్కటే. ఆచారాలు వేరైనా ఆంతర్యము ఒక్కటే. దారులు వేరైనా గమ్యం ఒక్కటే. అయితే భక్తి, కర్మ, జ్ఞాన మార్గాల ద్వారానే ఆధ్యాత్మిక భావనా బీజాలు సులువుగా అంకురిస్తాయి. సత్వర ఫలితాలను ఇస్తాయి.***

**- శ్రీ సద్గురుదేవులు**

# జీమూతవాహనుడు

(గత సంచిక తరువాయి) సేకరణ - మురళి

కొంతకాలమునకు జీమూతవాహనుడు సముద్రతీరమున తిరుగుతూ అక్కడ కుప్పలుగా పడియున్న ఎముకలు చూసి, విచారించగా అవి నాగుల ఎముకలని తెలిసింది. గరుత్మంతుడు నాగలోకానికి వెళ్ళి నాగులను చంపి తినటం వలన, వారి నాయకుడగు వాసుకి గరుత్మంతుణ్ణి చూసి, 'ఖగరాజా! నువ్వు కష్టపడి మా లోకానికి రావటం ఎందుకు? ప్రతిదినం ఒక సర్పాన్ని తెచ్చి సముద్ర తీరంలో నీకు ఆహారంగా అర్పిస్తాను' అని చెప్పి ప్రతి రోజూ పంపిస్తున్నాడు. గరుత్మంతుడు దానికి సమ్మతించాడు. వాటి ఎముకలే అక్కడ పడి వున్న ఎముకల గుట్టలు.

ఒకరోజు శంఖచూడుడు అనే సర్పము గరుత్మంతునికి ఆహారం కావలసిన రోజు వచ్చింది. అతని తల్లి కుమారుడి మరణం గురించి చేసిన రోదన జీమూతవాహనుడు విని, ఆ తల్లితో విచారించవద్దని, అతని బిడ్డకు బదులుగా తాను ఆహారంగా వెడతానని చెప్పాడు. కానీ దానికి శంఖచూడుడు జీమూతవాహనుడిని ఆ ప్రయత్నం నుంచి విరమించమని చెప్పాడు. తానే స్వయంగా ఆహారానికి సంసిద్ధుడై, స్నానం చేయటానికి వెళ్ళాడు. స్నానం ముగించి తిరిగి వచ్చేటప్పటికే గరుత్మంతుడు జీమూతవాహనుడిని నోట కరచుకుని, మలయ పర్వతం శిఖరాగ్రాన కూర్చున్నాడు.

శరీరం చీల్చి రక్తం త్రాగుతున్నా కూడా జీమూతవాహనుడు బాధ పడకుండా, నవ్వుతూ 'ఖగరాజా! నా దేహంలో ఇంకా రక్తమాంసాలు వున్నాయి నీ ఆకలి తీరేవరకు నా కండలను చీల్చి తిను' అన్నాడు. అంతలో గరుత్మంతుడు 'నేను నిన్ను ఎన్ని విధాలుగా చీల్చినా కూడా నువ్వు బాధ పడకుండా వున్నావు. నువ్వు నాగుల వంశీయుడవు కావు. నీవు సామాన్యుడవు కావు. నీవెవరవో నిజం చెప్పు' అన్నాడు.

అంతలో శంఖచూడుడు అక్కడకు చేరి, 'ఖగరాజా! పొరపాటు చేశావు. నాగునగు నన్ను తినటానికి బదులుగా విద్యాధర మహారాజైన జీమూతవాహనుడిని తింటున్నావు. అతనిని వదలిపెట్టి, నన్ను భుజించు' అన్నాడు.

గరుడుడు జరిగిన పాపానికి చింతించి, అగ్నిలో పడి మరణించటమే తనకు తగిన ప్రాయశ్చిత్తమని తలచి, అగ్నిలో ఆహుతి అవటానికి సిద్ధపడ్డాడు. జీమూతవాహనుడు గరుడుని వారించాడు.

ఇంతలో జీమూతవాహనుడి తల్లిదండ్రులు, భార్య మలయవతి

అక్కడకు చేరుకున్నారు. జీమూతవాహనుడు ప్రాణాలతో ఉండటం చూసి వారు సంతోషించారు. అప్పుడు గరుడుడు వారిని తనకు తగిన శిక్ష వేయమని కోరగా, జీమూతవాహనుడు 'ఖగరాజా! నువ్వు ప్రాణహింస మానివేయి. చేసిన పాపాన్ని మరల చేయనని పశ్చాత్తాప పడు. ప్రయత్నించి పుణ్యాన్ని వృద్ధిచేసుకో. జంతువుల భయాన్ని మాన్పించు. నీకు అంతకంటె వేరు ప్రాయశ్చిత్తం లేదు' అన్నాడు.

రక్తమాంసాదులు లేకపోవటంచేత జీమూతవాహనుడు మరణించాడు. అది చూసి అతని తల్లిదండ్రులు, భార్య, గరుత్మంతుడు మిక్కిలి దుఃఖించారు. మలయవతి గౌరీదేవిని ప్రార్థించింది. గరుడుడు స్వర్గానికి వెళ్ళి ఇంద్రుని ఆశ్రయించి, అమృతం తీసుకువచ్చి జీమూతవాహనుడి పైన, ఇంతకాలం తాను భుజించిన సర్పాలమీద చల్లాడు. అంతలో గౌరీదేవి ప్రత్యక్షమై ఆశీర్వదించినంతనే జీమూత వాహనుడు స్వర్ణదేహుడై లేచి నిలబడ్డాడు. గౌరీదేవి 'మీకు శుభమగుగాక!' అని ఆశీర్వదించి అదృశ్యమయింది. జీమూతవాహనుడు తల్లిదండ్రులు, భార్యా సమేతుడై తన రాజ్యమునకు వెళ్ళి, ప్రజలను కన్నబిడ్డల్లాగ పరిపాలించి, చివరకు శ్రీహరి సాయుజ్యం పొందాడు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా అక్టోబరు 2017, నవంబరు 2017 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి

అక్టోబరు 2017: AS 1109, 4032, 6448, 6531, 6535, 6566, 6575, 6576,6577,
AS 6769, 6909, 7174, 7179, 7184, 7367, 7368, 7369, 7370,
AS 7371, 7372, 7373, 7374,7377, 7378, 7379, 7382, 7383.

నవంబరు 2017: AS 4887, 6591, 6639, 7393, 7395, 7396, 7397, 7398, 7400

– మేనేజర్

# అధ్యారోపము

- పరాశర ప్రసాద్

అధ్యారోపము లేక అధ్యాస అనేది వేదాంత పరమైన సిద్ధాంతాలలో ఒకటి. వాస్తవానికి ఈ ప్రపంచం సృష్టింపబడలేదు. 'బ్రహ్మసత్యం జగన్మిథ్య' అనేది అందరకు తెలిసినదే. కాని దానిని నమ్మినవారు ఎంతమంది? ప్రపంచం బ్రహ్మంపై ఆరోపింపబడినది. అంటే బ్రహ్మం ఉన్న ప్రదేశంలో లోకం ఉన్నట్లు ఊహించుకోవటం అన్నమాట. యదార్థమైన దానిపట్ల అజ్ఞానంతో వేరొక విధంగా భావన చేయటమే అధ్యాస.

మనం ఎవరైనా స్నేహితులో, లేక బంధువుల యింటికో వెళ్లినప్పుడు వారు వేడి కాఫీ త్రాగమని అందజేస్తారు. యదార్థంగా కాఫీ వేడిగా ఉన్నా, ఆ వేడి కాఫీ ఉన్న కప్పుపైన ఆరోపింపబడటం చేత కప్పు వేడిగా ఉన్నది అంటాము. అదే అధ్యారోపము అంటే. త్రాడును చూసి సర్పమని, గుంజని చూసి మనిషని, శుక్తిని చూసి రజితమని, ఎండమావిని చూసి నీరని భ్రమపడటమే అధ్యాస.

దీనిని ఇంకా వివరంగా అర్థం చేసుకోవటానికి రజ్జుసర్ప భ్రాంతిని సోదాహరణగా తీసుకోవచ్చు. మసక చీకటిలో త్రాడును చూసి సర్పమని భయపడతారు. మనని తెలిసిన వారెవరైనా ఒక దీపాన్ని తీసుకువచ్చి అది సర్పం కాదు త్రాడే అని చూపించే వరకు ఆ భ్రమపోదు. భ్రమపడి నంత వరకు సర్పంలాగా కదులుతున్నట్లు భ్రాంతిని కలుగుజేస్తుంది. భ్రమ తొలగిన వెంట అధ్యారోపము అనే మాయ అదృశ్య మవుతుంది.

యదార్థానికి అక్కడ సర్పం లేదు. అక్కడ వర్తమానంలోగాని భూతంలోగాని భవిష్యత్తులోగాని సర్పంలేదు. అదే విధంగా లోకంలో గోచరించేదంతా బ్రహ్మమే. మానవుడు పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు కలిగి వుండి, వైవిధ్యత గల వస్తువులను దర్శిస్తాడు. సుఖదుఃఖాలను అనుభవిస్తాడు. కష్టనష్టాలకు గురి అవుతాడు. అయితే గురు సాంప్రదాయములో ఉన్న సాధకుడు ధ్యాన, మనన, నిదిధ్యాసల ద్వారా సత్యాన్ని గుర్తించి సర్వత్రా బ్రహ్మాన్నే దర్శిస్తాడు. బ్రహ్మం మార్పు చెందనిది. అది దేశ కాలాదులకు పరిమితమైనది కాదు. అయితే లోకంలో వైవిధ్యానికి కారణం ఏమిటి? అనేది అందరికి అవగాహన కావాలి. సూర్యుడు ఒక్కడే అయినా జలంతో కూడిన అనేక ఘటాలలో ఎలా ప్రతిబింబిస్తున్నాడో అలాగే బ్రహ్మం మాయా కల్పితమైన జగత్తులో వివిధ వస్తువులలో ప్రతిబింబించటం జరుగుతోందని భావించాలి.

ఎరుక, లేక చైతన్యము అనేది ఉన్నదే అది సాధించేది పొందేది కాదు. నేను తెలుసుకున్నాను అనే మాటలో 'నేను' తెలుసుకొనక పూర్వం, తెలుసు కున్నాక కూడా ఉన్నది. అదే బ్రహ్మం. ఆ ఎరుక, లేక తెలివిపైన అహంకారం అనే నేను ఆరోపింపబడి అధ్యాసకు అవకాశం కలిగింది. దాని ద్వారా జగత్తు గోచరిస్తోంది అని గుర్తించాలి. దానిని తెలియజేయగలవారే సమర్థులైన సద్గురుమూర్తి. ఆయన అనుగ్రహంతోనే అధ్యాస తొలగి జ్ఞానము ప్రకాశిస్తుంది.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

అక్టోబర్ 2017

05 గురువారం - ఆశ్వయుజ పౌర్ణమి - శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం, సాయంత్రం 5-30 ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

14 శనివారం - శ్రీ గురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

18 బుధవారం - నరక చతుర్దశి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

19 గురువారం- దీపావళి - ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

23 సోమవారం - నాగుల చవితి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

31 మంగళవారం- చిలుక ఏకాదశి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

నవంబర్ 2017

01 బుధవారం - క్షీరాబ్ధి ద్వాదశి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

03 శుక్రవారం - గురుపూర్ణిమ, గురునానక్ జయంతి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన- చాతుర్మాస దీక్ష పరి సమాప్తి

06 సోమవారం - శ్రీసద్గురుదేవుల ఆరాధన ప్రారంభం. సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

13 సోమవారం - శ్రీ గురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

24 శుక్రవారం - సుబ్రహ్మణ్య షష్ఠి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# సహజ సమాధి

- రమణ ప్రసాద్

సంత్ కబీరు సహజ సమాధి గురించి ఇలా చెబుతున్నాడు:-



**సాధో సహజ సమాధి భలీ।**
**ఆంఖ్‌న మూందో, కాన న రూంధో,**
**తనిక్ కష్ట్ నహి ధారీ।**
**ఖులే నైన్ పహచానో హసి హసి**
**సుందర్ రూప్ నిహారో॥**
**జహ జహ డోలో సో పరికర్‌మా,**
**జోకుఛ్ కరో తో సేవా।**
**జబ్ సోవో తబ్ కరో దండవత్,**
**పూజో ఔర్ న దేవా॥**
**కహెూ సో నామ్, సునో సో సుమిరన్**
**ఖావ్ పివో తో పూజా।**
**గిరహ్ ఉజాడ్ ఏక్‌సమ్ లేఖో**
**భావ్ మిటావా దూజా॥**
**శబద్ నిరంతర్ సే మన్ లగా**
**మలిన్ వాసనా త్యాగో।**
**ఉఠత్ బైఠత్, కబహు న ఛూటే**
**ఐసీ తారీ లాగీ॥** - కబీర్

కబీరు వారిని సాధువులని పిలుస్తాడు. ఎందుకంటే వారు ముముక్షువులు కనుక. సాధువు - అంటే సాధన చేస్తున్నవాడు. తనను తాను మార్చుకొని, పవిత్రత నొందటానికి, ఇతరులకు శుభం చేకూర్చటానికి అనవరతము కృషి చేసేవాడు. 'సాధు' అంటే సాదా, సరళం, సహజం - అని అర్థం. అందుకనే కబీరు అంటున్నాడు - "సహజ్ సమాధి భలీ" - సహజంగా, సరళంగా ఉండటమే సమాధి అని.

"నేను చాలామందిని చూశాను. సహజంగా ఉండే ప్రయత్నంలో జటిలంగా అవుతారు. సహజంగా ఉండాలనుకుంటారు, కాని విచలితమైపోతారు. అందుకే సహజంగా ఉండటం చాలా కష్టం. అసహజంగా ఉండటం చాలా తేలిక." అంటాడు ఓషో. మంచి గుణాలు

అలవరచుకోవటం కష్టం. చెడు గుణాలు తొందరగా అబ్బుతాయి. మన పూర్వీకులు టీ, కాఫీలు తాగేవారు కాదు. పాలు మజ్జిగలు తాగేవారు. బ్రిటిష్ పరిపాలన వచ్చిన తరువాత కాఫీ, టీలు అలవాటై, వాటిని సేవించనిదే నిదురకూడా లేని స్థితికి వచ్చారు.

కబీరు అంటున్నాడు - "కళ్ళు మూసుకోనక్కర లేదు. చెవులు మూసుకోనక్కర లేదు. కొంచెంకూడా కష్టం లేదు. కళ్ళు తెరుచుకుని ఆ సుందర రూపాన్ని తిలకించు. ఎక్కడికి వెళ్ళినా అది భగవంతుడికి పరిక్రమే; ఏ పని చేసినా అది భగవత్సేవే; నువ్వు పడుకుంటే అది భగవంతునికి సాష్టాంగ నమస్కారమే. కాబట్టి ఇతర దైవాలను పూజింప పని లేదు. నువ్వు మాట్లాడితే అదే నామం; నువ్వు వినేదే స్మరణ; తినటం, త్రాగటం పూజ. నీలో నుంచి వచ్చే నాదంపైన నిరంతరం దృష్టి పెట్టు; మలిన వాసనలను త్యాగం చెయ్యి. లేచినా కూర్చున్నా నాదం నుంచి నీ దృష్టి చెదరనీయకు"

నువ్వు చిన్నప్పుడు సైకిల్ నేర్చుకొన్నప్పుడు నీ దృష్టి దానిమీదే వుండేది. కారు డ్రైవింగ్ నేర్చుకొన్నప్పుడు ఎంతో జగ్రత్త అవసరం. కాని ఒకసారి, సైకిలు నడపటంగాని, కారు డ్రైవ్ చేయటం కాని వస్తే, అప్పుడు నీ దృష్టి నీవు తలపెట్టిన పనిమీదే ఉంటుంది. అలాగే మొదట కష్టం అనిపించినా అలవాటైతే నీ దృష్టి నీ ధ్యేయ వస్తువు పైనుండి చెదరదు. నీలోనుంచి వచ్చే అనాహత నాదాన్ని విను. నిరాకారంగా భావించిన బ్రహ్మను సాకారంగా అనుభవించు. ఏది తిన్నా, తాగినా అది ప్రభువుకి అర్పిస్తున్నానని భావించు.

ఆ అనాహత నాదమే ప్రణవం. ఒకసారి నీ మనస్సు ఓంకారంలో రమిస్తే, కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు పలాయనం చిత్తగిస్తాయి. కాగడా వేసి వెతికినా అవి కనపడవు. నీ మనస్సు సాక్షిగా ఉన్న చైతన్యంలో లయమైపోతుంది. అప్పుడు ఏ క్రియా లేదు. అంతా సహజం అయిపోతుంది. అంతిమ లక్ష్యమైన సహజ సమాధిని చేరుకుంటావు.

**మన్ హై హమారీ వ్యాధీ। సమాధీ హై హమారీ ఔషధీ॥** - మన వ్యాధికి కారణం మనస్సే ! సమాధే దానికి ఔషధం !!

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

కుంభముని యిలా సంభాషించారు, "శరీరము, మిగిలిన వస్తువులకు వాస్తవమైన వునికి వుంటే, అప్పుడు దృశ్య వస్తువులను గురించిన జ్ఞానము కూడ వుంటుంది. శరీరమునకు, మిగిలిన వస్తువులకు వునికి లేకపోతే జ్ఞానమునకు పునాది యెక్కడ వుంటుంది? నీ శరీరమే నిజమైన వునికియని, దానిపై ఆధారపడితే, ఓ రాజా, యీ విషయం చెప్ప నీ ఆత్మ శరీరము విడనాడినప్పడు, నీ జ్ఞానము దేనిపై ఆధార పడుతుంది?



శిఖధ్వజుడు మరల సమాధానము చెప్పాడు ' ప్రతి వ్యక్తితో చూడబడే యీ శరీరము కర్మ ఫలితాలననుభవించే యీ శరీరము. అవాస్తవమని యెలా భావిస్తారు? అందరిచేత చూడబడే యీ శరీరము, కరచరణములతో కూడి, అనేక రకములైన కర్మలనాచరించే యీ శరీరము యెలా తిరస్కరించగలము, ఈ శరీరమునకు వునికి లేదని యెలా చెప్పగలము?'

కుంభముని యిలా సమాధానము చెప్పాడు 'జన్మకు ముందీ శరీరము లేదు. మరణించి, దగ్ధమైన తర్వాత, యీ శరీరము లేదు. దేనికైతే ఆరంభంలో, అంత్యములో వునికి లేక, మధ్యన మాత్రమే గోచరిస్తుందో, అది మాయే. వాస్తవంగా దానికి వునికి లేదు.

కర్మల వల్ల లభించిన యీ శరీరము కారణముకాదు, కనుక తెలివి యొక్క ఫలితానికి కూడ వునికి లేదు. ప్రతి దానికి వొక కారణముంటుంది. కారణరహితమైన దానికి వునికిలేదు. అది మనకున్నది, లేక దానివల్ల వచ్చామన్న జ్ఞానము, లేక ఎరుక కేవలము మాయా భరితము. కావున అహంకారము, తత్ఫలితాలు వునికి లేనివి; నిజమైన కారణము లేక వున్నట్లు కనిపించే యే వస్తువైనా, ఎడారిలో యెండ మావిలా అవాస్తవమైనది. కారణము లేకుండ, దృశ్యమయ్యే యే వస్తువైనా ముత్యపు చిప్పలోని వెండిలా, కర్రలోని మనిషిలా

అవాస్తవమయినది. శరీరము, అహంకారము యొక్క వాస్తవమైన వునికిని నమ్మటం గొడ్రాలి యొక్క కొడుకు శరీరమునలంకరించటం లాంటిది".

శిఖిధ్వజుడిలా ప్రశ్నించాడు "ఈ శరీరములు రావటానికి, తండ్రులను కారణభూతంగా మనము తీసుకోకూడదా?".

కుంభమునిలా సమాధానము చెప్పాడు "తండ్రి కారణము కాదు, అతను రావటానికి మరొక కారణముంటుంది". శిఖధ్వజుడిలా అన్నాడు, "మన తల్లి తండ్రులే మన పుట్టుకకు కారణము. అలాగే మన తల్లిదండ్రులు వారి తల్లిదండ్రుల ద్వారా వుత్పన్నమయినారు కనుక వారి జన్మకు కారణము వారి తల్లిదండ్రులు కనుక బ్రహ్మ మన ప్రప్రథమ పితామహుడు. మానవ జాతి సృష్టికే ప్రధాన కారణభూతుడు, అందుకే బ్రహ్మను సృష్టి కర్త అన్నారు.

ఓ పూజ్య కుంభమునీ! నేను చెప్పింది వాస్తవమే కదా, కుంభమునిలా సమాధానము చెప్పాడు "ప్రప్రథమ సృష్టికర్త, పితామహులందరికి ప్రథమ పితామహుడైన బ్రహ్మ కూడ అసలైన కారణం కాదు. ఆయనకు కూడ పుట్టుకకు వొక కారణం కావలసి వచ్చింది. సృష్టికి పూర్వము ద్వైతరహితమై, స్వయం వునికికలిగి, స్వయం ప్రకాశమైన పరబ్రహ్మ మొక్కడే ప్రకాశిస్తున్నాడు. ఈ విశ్వము కేవలము దృశ్యమానము, ఎండమావిలో నీరు గోచరించినట్లు, యీ విశ్వము గోచరిస్తుంది, అందువల్ల బ్రహ్మసృష్టికర్త యనుకోవటం తప్పడు అభిప్రాయము. ముత్తాత వునికి కూడ, అవాస్తవము. సృష్టి అన్నదేలేదు, ఇక సృష్టింప జీవులున్నది అవాస్తవము. ఉన్నది పరమాత్మ తప్ప వేరొకటి లేదు. శిఖధ్వజుడిలా అన్నాడు "పూజ్యుడైన ఓ కుంభమునీ! పరబ్రహ్మమే బ్రహ్మకు కారణము కాదా?"

కుంభమునిలా సమాధానము చెప్పాడు "పరబ్రహ్మకు జననము మరణములు లేవు, పరబ్రహ్మము కారణరహితుడు, పరిణామ రహితుడు, కాలాతీతుడు, కర్మరహితుడు, ఆద్యంతములు లేని వాడు, అతడు కారణంకాదు. అతను నటుడుకాదు, ఆనందించేవాడు కాదు. వున్నది జీవించే వాస్తవ మొక్కటే. అదే పరబ్రహ్మము. మొత్తము విశ్వమంతా సంపూర్తిగా అదృశ్యమవుతుంది, నీవు ఆత్మను సర్వత్రా చూడగలవు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**అక్టోబర్ 2017**

01ఆది - ఏకాదశి - ఏకాహం, దీక్షా విరమణ, బీజ పూరిత మంత్రాక్షతలతో శ్రీ మాతాజీ వారి ఆశీర్వచనము. రాత్రి 7 గం॥లకు శ్రీ జగన్మాత నగరోత్సవము (ఊరేగింపు).

02 సోమ -గాంధీ జయంతి. రాత్రి 8 గం॥లకు శ్రీసద్గురుపాదపూజ.

05 గురు - ఆశ్వయుజ పౌర్ణమి - శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

14 శని - శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

18 బుధ - నరక చతుర్దశి, మాసశివరాత్రి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం. పావులూరు శాఖలో ఏకాహం

19 గురు - దీపావళి అమావాస్య - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

23 సోమ - నాగుల చవితి- అక్టోబర్ 22 నుండి నవంబర్ 1 వరకు ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వరస్వామివారికి పంచామృతములతో, నవరసాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన.

**నవంబర్ 2017**

01 బుధ - క్షీరాబ్ధి ద్వాదశి - శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

03 శుక్ర -గురుపూర్ణిమ, గురునానక్ జయంతి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన, సాయంత్రం 6గం.లకు జ్వాలాతోరణం, శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఊరేగింపు. చాతుర్మాస్యదీక్షా పరి సమాప్తి. కార్తీక బహుళ తదియ నవంబర్ 06 సోమవారం నుండి కార్తీక బహుళ ఏకాదశి నవంబర్ 13సోమవారం వరకు శ్రీసద్గురుదేవుల ఏకోన త్రింశతి (29వ) వార్షిక పుణ్యారాధన మహోత్సవాలు.

06-11-2017 సోమవారము : ఉదయము 8 గం. 19 ని॥లకు **పూజ్యశ్రీ మాతాజీ వారిచే సాప్తాహ్నిక దీక్షా సంకల్పము,** అఖండజ్యోతి ప్రజ్వలనము, పంచయజ్ఞ విధులతో దీక్షా ప్రారంభము. రాత్రి 7గం॥లకు శ్రీ సద్గురు దేవుల పుణ్యారాధన.

10 శుక్ర : రాత్రి 7గం॥లకు శ్రీ సద్గురుదేవుల ఊంజలసేవ. (డోలోత్సవం)

11 శని : రాత్రి 7గం॥లకు రథోత్సవము.

12 ఆది : సాయంత్రం 6గం.లకు దీపోత్సవం, 7గం.లకు శ్రీసద్గురుదేవుల పుణ్యారాధన.

13 సోమ : శ్రీ గురుదశమి : తె.జా 3గం॥లకు శ్రీ సద్గురు దేవులకు మహాభిషేకము, ఉదయం 7గం.లకు సామూహిక పూజలు, 10గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

16 గురు - మాస శివ రాత్రి, పావులూరులో ఏకాహం.

18 శని - అమావాస్య

24 శుక్ర - శ్రీ సుబ్రహ్మణ్య షష్టి.

29 బుధ - గీతా జయంతి, ఉదయం 9॥ గంలకు శ్రీమద్భగవద్గీత పారాయణ.



**వినాయక చవితి సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర పూజలో పాల్గొన్న శ్రీ మాతాజీ**

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

జన్మకి వచ్చిన వారు ఎవరైనా దేహాన్ని వదిలి పెట్టవలసినదే. అది మాత్రం సత్యం. అయితే సాధకులందరూ దానికి సంసిద్ధులేనా? సంసిద్ధుడైనా కాకపోయినా అది తప్పదు. సంసిద్ధత అంటే ఏమిటో సద్గురుదేవులు వివరించారు.

సంసిద్ధత అంటే మనస్సు సంకల్ప రహిత స్థితి అన్నమాట. ఆ స్థితిని సాధించాలంటే సద్గురుమూర్తి అనుగ్రహం లేనిదే సాధ్యపడదు.



మనస్సులో సంకల్పాలు బీజదశలో ఉండవచ్చు. అవి సమయం వచ్చినప్పుడు బయటపడతాయి. అదే వాసన అంటే.

సద్గురుదేవులు మాట్లాడుతూ "సంకల్పం జనించినప్పుడు దానిని బలవంతంగా అణిచివేయ కూడదు. అలా చేస్తే అది ఎప్పటికైనా అంకురించి, తిరిగి జన్మకు తీసుకు వస్తుంది" అనేవారు. అందువలన సంకల్పం కలిగినప్పుడు దానికి భయపడకుండా ధర్మబద్ధమైనదైతే దానిని నెరవేర్చి విచారణ చేయాలి. అంతేకాదు విచారణ ద్వారా మనస్సు తప్పక సమాధాన పడుతుంది. మననము వేరు, విచారణ వేరు. మననం అంటే మనస్సులో ఏర్పడిన భావనను కొనసాగించటం. అలాకాకుండా భావన కలిగినప్పుడు దానిలోని సాధక బాధకాలను గూర్చి మనస్సులో చర్చించటం విచారణ. అలా చేయటం ద్వారా మనస్సులో జనించిన భావన సమసిపోయే అవకాశం ఉంది.

సంకల్పం జనించటం తప్పుకాదు. అది క్రియా రూపం దాలిస్తే కర్మ అంటుతుంది. ఇంద్రియాలు నిర్వహించే ఏ పనైనా క్రియగా వ్యవహరింప బడుతుంది. అది మనస్సు ద్వారా జరిగితే కర్మ అవుతుంది. కర్మకి ఫలము తప్పదు. భక్తి, లేక ప్రేమ భావనతో గాని ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే ఏ పనైనా సేవగా భావింప బడుతోంది. మనస్సులో కదలికలు తప్పవు. కదలికలు అంతరిస్తే ప్రశాంతతే. మనస్సులో ప్రశాంతత కలగాలంటే బుద్ధి మనస్సులో లయమవ్వాలి.

బుద్ధి వికసించినప్పుడే మనస్సులో లయమవుతుంది. బుద్ధి వికసించి వివేకవంతమవ్వాలంటే సద్గురుమూర్తి బోధా శ్రవణం చేయవలసినదే. బుద్ధి వికసించినప్పుడు త్యాగ భావన కలుగుతుంది. ఆ త్యాగ భావనే ప్రేమ. త్యాగము చేయవలసినది ధనధాన్యాలు కాదు. నీలో ఉన్న 'నేను, నాది' అనే భావన. అదే బంధానికి కారణం. 'నేను, నాది' త్యాగం చేయుటం ద్వారా బంధ విముక్తి కలుగుతుంది. 'నేను, నాది' అనే భావనే. 'మూలా జ్ఞానము' అదే అవిద్య, లేక అజ్ఞానము. 'నేను, నాది' అనేదే ఆవరణ దోషము. అంతేగాని ఉపాధి ఎన్నడూ ఆవరణ దోషం కాదు.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

అక్టోబర్ 2017

05 గురువారం- ఆశ్వయుజ పౌర్ణమి; శ్రీ మాతాజీ జన్మదిన మహోత్సవం - రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

14శనివారం- శ్రీ గురుదశమి - రాత్రి 7గం.లకు శ్రీ సద్గురుపాద పూజ.

18 బుధవారం - నరకచతుర్దశి

19 గురువారం - దీపావళి.

నవంబర్ 2017

03 శుక్రవారం- గురుపూర్ణిమ, గురునానక్ జయంతి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన(చాతుర్మాస్య దీక్ష పరి సమాప్తి)

13 సోమవారం - శ్రీ గురు దశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

# శకుని

- రమణ ప్రసాద్

పాండవులు, కౌరవులు చిన్నతనంలో ఆడుకుంటున్నప్పుడు, దుర్యోధనుడు, "మీరు పాండురాజుకు పుట్టినవారు కారు" అని హేళన చేశాడు. ధర్మరాజు, "మీరు విధవరాలికి పుట్టిన బిడ్డలు" అని బదులు ఇచ్చాడు. ఈ విషయం దుర్యోధనుడు భీష్ముడిని అడిగాడు. ధర్మరాజు అబద్ధం ఆడడని తెలుసు. భీష్ముడు దృతరాష్ట్రుని పత్ని గాంధారి సాముద్రిక పత్రాన్ని (హొరోస్కోప్)తెప్పించి చూశాడు. అందులో గాంధారి మొదటి భర్త చనిపోతాడని వ్రాసి ఉంది. అందుకని గాంధారిని ఒక మేకకు కట్టబెట్టి, ఆ తరువాత దానిని దేవుడికి బలి ఇచ్చి, దృతరాష్ట్రుడికి ఇచ్చి వివాహం చేస్తారు. కాని ఈ విషయాన్ని కప్పిపుచ్చుతారు. భీష్ముడికి కోపం వచ్చి గాంధార కుటుంబ సభ్యులందరిని పిలిచి వారిని కారాగారంలో బంధిస్తాడు.



గాంధార దేశపు రాజు సుబలుడు. ఆయన కుమార్తె గాంధారి. ఆమెను ధృతరాష్ట్రుడికి ఇచ్చి వివాహం చేస్తారు. తన భర్త అంధుడు కనుక, గాంధారి తన కళ్ళకు గంతలు కట్టుకుంటుంది. సుబలుడికి నూరుగురు సంతానం. వారిలో చిన్నవాడు శకుని. అతనికి గాంధారిని అంధునికి ఇచ్చి చేయటం ఇష్టం లేదు. ఆమె భర్త కోసం తన కళ్ళకు గంతలు కట్టుకోవటం అసలు ఇష్టం లేదు.

భీష్ముడు సుబలుని వారి పుత్రులను కారాగారంలో ఉంచి వారికి ఒక్కొక్కరికి ఒక మెతుకు చొప్పున ఆహారం పైనుంచి పడేయించేవాడు. సుబలుడు తనవారితో ఇలా అన్నాడు, 'ఈవిధంగా మనం ఒక్కొక్క మెతుకు తిని చావటంకన్నా ఈ మెతుకులన్నీ కలిపి మనలో మేధావి అయిన ఒక్కడిని బ్రతికిద్దాం. అతడు బయటపడి కక్ష తీర్చుకుంటాడు' అన్నాడు. 'నేను మరణించిన తరువాత నా తొడలోని

ఎముకలతో పాచికలు చేసి వాటి సహాయంతో మీ ప్రతీకారంతీర్చుకోండి" అని అంటాడు. ఆ పాచికలు ఎంతో మహిమ కలవి. శకుని ఎన్ని అంకెలు పడాలో తల్చుకుని వేస్తే అన్నే పడేవి. అందరూ తమ వంతు ఆహారం శకునికి ఇచ్చి అతనిని బ్రతికిస్తారు. తిండి లేక సుబలుని పరివారం అంతా మరణిస్తారు. ఒక్క శకుని మిగులుతాడు.

శకుని భీష్మునితో , "నా వారంతా చనిపోయారు. మీరు నన్ను క్షమించి  ఈ కారాగారం నుండి విడుదల చేయండి" అని కోరగా శకుని విడుదలై, శివుని కొరకై తపస్సు చేసి, కౌరవ వంశం అంతం కావాలని కోరుకుంటాడు. తన పథకం ప్రకారం  కౌరవులవైపు నిలిచి, జూదంలో పాండవులను ఓడించి, వారిని యుద్ధంలో దించితే కాని కౌరవ వినాశనం జరగదు. తత్ఫలితంగా కురుక్షేత్ర యుద్ధం జరిగి కౌరవులందరూ చనిపోయారు.

శకుని వేసిన పాచిక పారింది! పథకం ఫలించింది!


**SUBSCRIPTION NOTIFICATION FOR ENGLISH (QUARTERLY) AND TELUGU(MONTHLY) SAMARDHA SADGURU MAGAZINES**

TELUGU MAGAZINE LIFE MEMBERS ARE REQUESTED TO BECOME 'MAHARAJA POSHAKULU' AND 'RAJA POSHAKULU' BY DONATING RS.11,116/- AND 5,116/- RESPECTIVELY.

WE ALSO APPEAL LIFE AND ANNUAL SUBSCRIBERS TO BECOME LIFE MEMBERS BY REMITTING RS.1,116/- THIS WILL BE OF GREAT HELP TO MEET THE INCREASE IN COSTS OF VARIOUS INPUTS.

WE ALSO REQUEST THE DEVOTEES TO SUBSCRIBE FOR SAMARDHA SADGURU QUARTERLY ENGLISH MAGAZINE. SUBSCRIPTION FOR ENGLISH MAGAZINE IS RS 100/- FOR FIVE YEARS.

REMITTANCES SHOULD BE MADE IN THE NAME OF Y.S.C.K.P.M CHARITABLE TRUST-A/C SAMARDHA SADGURU MAGAZINE BY M.O/ DRAFT/MAIL TRANSFER

SAMARDHA SADGURU MANAGEMENT

# అంజలి

సీ॥ లోకాల చీకట్లు పోకార్ప రవి చంద్ర
దీపాలు గగనాన త్రిప్పలేక
జగతిపై బడవచ్చు జలరాశి కెరటాలు
మామూలు మేరకు మడవలేక
పనిమాలి ప్రతిరోజు ప్రాణికోటుల
గుండె గడియారముల కీలు కదపలేక
అందాలు చిందు నీలాకాశ వేదిపై
చుక్కలముగ్గులు చెక్కలేక

తే.గీ॥ ఎంత శ్రమ నొందు చుంటివో యేమొ స్వామి
అడుగిడితి వెట్లో మా గడపలోన
గుండె కుదిలించి నీ ముందు కుప్పవోతు
అందుకోవయ్య హృదయ పుష్పాంజలులను



**శరన్నవరాత్రి దీక్షా స్వీకరణకు అంకురార్పణ చేస్తున్న శ్రీమాతాజీ**

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

లోకానున్మదయన్, శ్రుతీర్మఖరయన్
శ్రోణీరుహాన్ హర్షయన్
శైలాన్విద్రవయన్, మృగాన్వివశయ న్గోబృన్ద మానన్దయన్
గోపాంసంభ్రయన్ మునీన్ముకళయన్, సప్తస్వరాన్ జృమ్భయ
న్నోఙ్కారార్థ ముదీరన్విజయతే వంశీ నినాద శ్శిశోః ॥

తాత్పర్యము -



బాలకృష్ణుని యొక్క పిల్లన గ్రోవి మోత భువనమునందు మోహింపజేయుచు, వేదములను బల్కించుచు, వృక్షములను సంతసింప జేయుచూ, కొండలను కరిగించుచు, మృగములను ఒడలు మరపించుచు, గోవుల మందలను అలరింప జేయుచు, గోపకులను సంబర పెట్టుచు, యోగులను ధ్యాననిమగ్నులుగా చేయుచు, ఏడు స్వరములను విస్తరించుచు ఓంకారార్థమును చెప్పుచు వెలయుచున్నది.

వంశీమోహనుని మురళీగానము అంత మహిమగలది!!

*భగవానుని తేజస్సు సర్వేసర్వత్ర పరివ్యాప్తమై ఉన్నది.*
*మనస్సులో ఆధ్యాత్మిక జ్ఞానమనే చిరుదివ్వె వెలిగించిన నాడే*
*కళ్ళల్లో కాంతి ప్రసారం జరుగుతుంది.*
*అప్పుడే ఆ దివ్యతేజస్సుని*
*కనులు చూడగలుగుతాయి*

*- శ్రీ సద్గురుదేవులు*

# సరస్వతి

- రమణ ప్రసాద్

**యాకుందేందు తుషారహారధవళా యా శుభ్రవస్త్రాన్వితా**
**యా వీణా వరదండ మండితకరా యా స్వేత పద్మాసనా**
**యా బ్రహ్మాచ్యుతశంకర ప్రభృతిభి ర్దేవైస్సదా వందితా**
**సామాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా ॥**

సరస్వతి- సార - సారము; స్వ- ఆత్మయొక్క; అంటే ఆత్మయొక్క సారము అనే అర్థం వస్తుంది. సరస్వతీదేవిని,- బ్రహ్మణి, బ్రాహ్మి, భారతి, వాణి, వర్ణేశ్వరి, శారద అనిఎన్నో పేర్లతో కొలుస్తారు. వీణ, పుస్తకాలను ధరించింది కాబట్టి 'వీణా పుస్తక ధారిణి' అని, వాక్కును ఇచ్చే దేవత కాబట్టి 'వాణి' అని, వరాలు ఇచ్చే తల్లి కాబట్టి 'వరదాయిని' అని, బ్రహ్మ యొక్క సతి కాబట్టి 'సావిత్రి' అని, వేదమాత కాబట్టి 'గాయత్రి' అని పిలుస్తారు.



సరస్వతిని ధవళ వస్త్రధారిణి, స్వేత పద్మస్థిత, వీణా పుస్తక ధారిణిగా వర్ణిస్తారు. ఆమె వాహనం స్వేత వర్ణం కల హంస. చంద్రునివంటి తెల్లని కాంతి కలిగి, తెల్లని వస్త్రాలు ధరించిన, హంస వాహినిగా ఆమెను ధ్యానిస్తారు.

దేవీ నవరాత్రులలో, ఆమె జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రంనాడు ఆమెను పూజిస్తారు. ఉత్తర దేశంలో మాఘ మాసంలో వచ్చే వసంత పంచమినాడు ఆలయాలలో, విద్యాలయాలలో, ఇళ్లల్లో సరస్వతీమాత పూజ చేస్తారు.

చదువుల తల్లి, వాక్కునిచ్చే దేవి 'వాగ్దేవి'. గంగా యమునా నదులలో అంతర్వాహినియై సరస్వతీ నదిగా ప్రవహిస్తుంది. వేదాలకు, శాస్త్రాలకు. సకల కళలకు, విద్యాబుద్ధులకు మూలం సరస్వతీ దేవి. అందుకే ఏ విద్య ఆరంభించినా ముందుగా ఆమెను ఈ విధంగా ప్రార్థిస్తారు -

**సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ।**
**విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా ॥**
**సరస్వత్యై నమో నిత్యం భద్రకాళ్యై నమో నమః ।**
**వేద వేదాంత వేదాంగ విద్యాస్థానేభ్య ఏవ చ ॥**

**సరస్వతీ మహా భాగే విద్యే కమలలోచనే।**
**విద్యారూపే విశాలాక్షీ విద్యాం దేహి నమోஉ_స్తుతే॥**

హే సరస్వతీ మాతా! మాలోని మోహంధకారాలను తొలగించి, మా హృదయాలలో ఎల్లకాలం నివసించు తల్లీ ! అని వేడుకొందాం!



**దసరాలో సత్సంగ సమావేశానికి సభకు విచ్చేసిన శ్రీమాతాజీ**



**కుంకుమ పూజ అనంతరం భక్తులకు తీర్థం ఇస్తున్న శ్రీ మాతాజీ**

# శ్రీ పరమానందయ్య శిష్యులు

- రమణ ప్రసాద్

శ్రీ పరమానందయ్యగారికి తనశిష్యుల పైన ఎంతో ప్రేమ. వారి శిష్యులు తమ గురువుగారి పైన ఎంతో వినయ విధేయతలు భక్తి కలిగినవారు. గురువుగారు ఏది ఆజ్ఞాపిస్తే అది వెంటనే చెయ్యటమే కర్తవ్యంగా భావించేవారు. అయితే వారు చేసే అవక తవక పనులు అందరికీ నవ్వు తెప్పిస్తాయి. ఈ కథ చూద్దాం.....



**ఏరు నిదరోయింది**

పరమానందయ్య గారు ఒక శుభ కార్యం జరపవలసివచ్చింది. ఏ శుభకార్యం చేయాలన్నా కావలసింది డబ్బే కదా! అందుకోసంగా చుట్టు ప్రక్కల గ్రామాలకు విరాళాలు సేకరించటానికి ఆయన తన పన్నెండు మంది శిష్యులతో బయలుదేరారు. శిష్యులంటే వీరికి పంచ ప్రాణాలు. వీరు లేనిదే వారు ఉండలేరు. కొన్ని గ్రామాలు తిరిగారు. విరాళాలు బాగానే ముట్టాయి. వాటిని నాలుగు మూటలుగా కట్టారు. అప్పటికే సాయంత్రం అయింది. చీకటి పడబోతోంది. గబగబ నడిచివస్తున్నారు. త్రోవలో వారికి ఒక ఏరు అడ్డమొచ్చింది. ఆ ఏరులో మోకాలిలోతు మాత్రమే నీళ్ళు ఉన్నాయి. ఒక శి,ష్యుడికి కోపమొచ్చింది." ఈ ఏటికి బుద్ధి ఉందా? మేము మా గురువుగారితో వస్తుంటే ఈ ఏరుకి మా ప్రయాణం ఆపాలని ఉంది. దీనికి గురువుగారన్నా భయం లేదు. మూటలు మోసుకుంటూ వచ్చి అలసిపోయామన్న ఆలోచన కూడా లేదు దీనికి" అనుకుని, "గురువుగారూ! మీరు హాయిగా విశ్రాంతి తీసుకోండి. ఈ నది పొగరు మేమణుస్తాం" అని ఒక శిష్యుడిని పిలిచి కాగడా వెలిగించమన్నాడు.

"ఎందుకూ" అనడిగాడతడు.

"చురకెయ్యటానికి"

"ఎవరికీ"

"ఏరుకి"

ఏటికి చురకలు ! భలే భలే అనుకుంటూ అతడు కాగడా

అంటించి తెచ్చాడు. ఆ కాగడా పట్టుకుని పిల్లిలా, శబ్దం చేయకుండా ఏటి దగ్గరకు వెళ్ళాడు. చటుక్కున ఆ కాగడాని నీటిలో ముంచాడు. అది "చుయ్" అని శబ్దం చేసింది. శిష్యుడు బెదిరిపోయి,"బాబోయ్!" అని పరిగెత్తుతూ వచ్చి గురువుగారి దగ్గరకు వచ్చి పడ్డాడు. ఆయనకు మెలకువ రాలేదు. 'ఏమయిందిరా!' అనడిగాడింకొక శిష్యుడు. "అది పడుకోలేదురోయ్! ఇంకా మెలకువగానే ఉంది. నేను వాత పెట్టబోతుంటే పగ పట్టిన పాములాగా కెరటాల రూపంలో వచ్చి నన్ను కాటేసిందిరా. చస్తే అందరి మధ్యా ధైర్యంగా చద్దామని పరిగెత్తుకొచ్చేశాను" అన్నాడు భయంతో వణికిపోతూ.

ఇక ఆ శిష్యులు ఆ ఏరుని తిట్టుకోసాగారు. "ఇది దొంగ ఏరు. ఒకసారి ఏమయిందంటే...... ...... .. మా తాతది ఉప్పు వ్యాపారం. ఆయన ఉప్పును అమ్మటానికి పట్నం వెళ్ళేవాడు. ఒకసారి రైతులు పండించిన ఉప్పు ఎర్రగా ఉంది. కాని కొనుగోలుదారులు ఉప్పు తెల్లగా ఉండాలి అంటారని ఉప్పు బస్తాలను ఏటి నీరుతో కడిగాడు. పట్నం వచ్చే సరికి బస్తాలు బస్తాలలాగే ఉన్నాయి. కాని వాటిలో ఉప్పు మాత్రం లేదు. ఈ దొంగేరుది ఆ ఘన కార్యం. మా తాత ఆ నష్టం భరించలేక గుండె ఆగి మరణించాడు. అలా దొంగ దెబ్బ తీస్తుంది" అన్నాడు. "ఈ ఏరు బిడ్డలను మింగుతుందట. మనం ఎంతో జాగ్రత్తగా ఉండాలి" అన్నాడింకొకడు. గురువుగారికి చెబుదామంటే ఆయన నిద్ర పోతున్నారు.

ఇంతలో ఒక యువకుడు గుర్రం మీద స్వారీ చేస్తూ ఏరు దాటాడు. అది చూసిన శిష్యులు ఆశ్చర్యపడ్డారు. "చూడండిరా ఎంత ధైర్యంగా ఏరు దాటాడో? ఏరు నిద్దరోతోంది కాబోలు. మనంకూడా ఇదే సందని దాటేద్దాం" అని సలహా ఇచ్చాడొకడు. ఒక శిష్యుడు ధైర్యం చేసి, రక్షరేకు కట్టుకొని, కాగడా పట్టుకుని, ఆంజనేయ దండకం చదువుతూ ఏటి వద్దకు వచ్చాడు. ఏటిలోకి మెల్లగా వెళ్ళాడు. చేతిలోని కాగడాని ముంచాడు. కాగడాకి నిప్పు లేదు కనుక ఏ శబ్దం రాలేదు. అతడు శిష్యుల దగ్గరకు వచ్చి, "ఒరేయ్! ఏరు నిదరోతోంది. ఇదే సమయం. ఏరు దాటేద్దాం" అన్నాడు.

-సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

సీతమ్మగారిని వారి సన్నిహితులు కొందరు 'మీరు యిటువంటి దివ్యానుభవాలను ఎలా పొందగలిగారు?' అని ప్రశ్నిస్తే "శ్రీబాబును ఎప్పుడూ కన్నార్పకుండా చూడండి. అదే నాకు తెలిసిన మంత్రం" అన్నారు సీతమ్మగారు. శ్రీబాబు సన్నిధిలో ఉన్నంతసేపూ సీతమ్మగారు అలాగే తదేక దృష్టితో శ్రీ బాబును కన్నార్పకుండా చూసేవారు. ఇక చుట్టు ప్రక్కల ఏమి జరుగుతున్నది ఆమెకు తెలిసేది కాదు. తన గురుమూర్తిని ఆమె తన మనోఫలకంపై ముద్రించుకున్నదని, అందువలన సర్వమూ గురుమయంగానే ఆమె దర్శించుకో గలుగుతున్నదని శ్రీబాబు ఒక సందర్భంలో భక్తులతో చెప్పారు.



1955లో అమీనా సుబ్రహ్మణ్యం గారికి కొవ్వూరు బదిలీ అయిన తరువాత సీతమ్మగారు తదితరుల ప్రార్థనను మన్నించి, శ్రీబాబు తాతయ్యగారింట్లో ఉండటానికి అంగీకరించారు. వారింట్లో తాతయ్యగారు పడుకొనే ఒక యిరుకైన గది ఉంది. ఆ గది తమకు చాలునని, అందులో ఉంటానని శ్రీబాబు అన్నారు. ఇంట్లో వాళ్ళందరికీ యిష్టమే గాని, తాతయ్యగారు ఏమంటారో అని భయపడ్డారు. నిజానికి అప్పట్లో తాతయ్యగారికి శ్రీ బాబుపై పెద్దగా భక్తి ఏర్పడలేదు. కాని చిత్రంగా, తాతయ్యగారు శ్రీబాబుకు తమ గదిని యివ్వటానికి సంతోషంతో అంగీకరించారు.

శ్రీకృష్ణజన్మాష్టమి నాడు శ్రీ బాబు తమ దేవతార్చనతో సహా తాతయ్యగారింటికి వచ్చారు. ఆ రోజున తాతయ్యగారు, అమ్మమ్మగారు ఊళ్ళో లేరు. శ్రీబాబు తమ పూజ ముగించిన తరువాత శ్రీకృష్ణ తత్త్వమును గురించి చక్కని బోధ చేశారు. మహానివేదనము అయిన తరువాత, నివేదన చేసిన పదార్థమంతా శ్రీబాబు ఒక పెద్ద పళ్ళెంలో కలిపి, అందరిని చుట్టూ కూర్చోబెట్టుకుని, ఒక్కొక్కరి చేతిలో ముద్దలు పెడుతూ, "బాలకృష్ణుడు తన తోటి గోపబాలురితో కలిసి చల్దులారగిస్తూ, యిలాగే

అందరికీ ముద్దలు పెట్టేవాడు. ఈనాడు ఆ దివ్య ప్రభువు స్మరణతో శ్రీకృష్ణజాన్మష్టమి పర్వదినం సార్ధకమైనది" అన్నారు. బాలకృష్ణుని రూపంలో శ్రీబాబును, గోపబాలురందరి రూపాలలో చుట్టూ కూర్చున్న వారిని, తమను తలుచుకొని సీతమ్మగారు దివ్యానుభూతిని పొందారు. ఈ కార్యక్రమమంతా ముగిసేసరికి తెల్లవారు ఝామున ఐదు గంటలైంది.

శ్రీబాబు ఏ ఊరు వెళ్ళినా, ఎవరింట్లో ఉన్నా, ఆ యిల్లు ఎంత చిన్నదైనా, వారికోసం వచ్చే భక్తుల సంఖ్య మాత్రం వందలలో ఉండేది. అందులో అన్ని కులాలవారు, లక్షాధికారులు, నిరుపేదలు, స్త్రీలు, పురుషులు, బాలురు, వృద్ధులు, వ్యాధి పీడితులు అన్ని రకాలవారూ వుండేవారు. ప్రతి ఒక్కరూ సమస్యల మూటలతో వచ్చేవారే! శ్రీబాబు వస్తారని తెలిసి ముందుగానే వచ్చినవారు, శ్రీ బాబుతో పాటు వచ్చినవారు, శ్రీబాబు వచ్చారని తెలిసి వచ్చినవారు, అప్పటికప్పుడు అర్జంటు పనుల మీద వచ్చినవారు , యిలా ఎందరెందరో! వారందరికీ, ఎవరు ఏవేళకు వచ్చినా , ఉదయం కాఫీ ఫలహారాలు; మధ్యాహ్నం ఎప్పటికప్పుడు వేడి వేడి వంటకాలతో భోజనము; సాయంత్రము కాఫీ ఫలహారాలు; రాత్రిపూట భోజనం చేసేవారికి భోజనము, ఫలహారం చేసేవారికి ఫలహారము; యివి గాక వారి వారి అభీష్టాలను అనుసరించి మధ్యే మధ్యే పానీయాలు; యిలా విరామం లేకుండా తాతయ్యగారి కుటుంబ సభ్యులు అతిథులను సేవించుకొనే వారు. ప్రతి ఒక్కరిని అజ కనుక్కుని కొసరి కొసరి వడ్డించి తినిపించేవారు. రాత్రి పొద్దుపోయాక వచ్చే అతిథులకు కూడా భోజనం వేడి వేడిగానే వడ్డించే వారు. వారి వంటింట్లో యిరవై నాలుగు గంటలూ అగ్ని హొత్రుడు ప్రజ్వలిస్తూనే వుండేవాడు.

మొదట్లో తాతయ్యగారికి అన్ని కులాల వాళ్ళు కలిసి చేసే సహపంక్తి భోజనము, వేళా పాళా లేకుండా తిరణాల లాగా వచ్చిపడే భక్తులు; యిదంతా చాలా చిరాకు కలిగించేది. పైకి ఏమీ పట్టించుకోనట్లే కనిపించినా, తాతయ్యగారు వచ్చే భక్తులను, వాళ్ళ ప్రవర్తనను, శ్రీబాబు వారితో మాట్లాడే తీరును నిశితంగా గమనించ సాగారు. అలాగే శ్రీబాబు ఏదైనా బోధ చెబుతున్నపుడు ఒక చెవి అటువైపు పెట్టి వినేవారు.

- సశేషం

విష్ణు  కథలు

-గత సంచిక తరువాయి

# మీరాబాయి

- రమణ ప్రసాద్

తాన్‌సేన్ స్వతహాగా మంచి గాయకుడు కాబట్టి అతడు కూడా మీరాచేసే గానంలో లీనమై తానెక్కడ ఉన్నదీ మరిచాడు. సన్యాసుల వేషాలలో ఉన్న అక్బర్ చక్రవర్తినిగాని, తాన్‌సేన్‌నిగాని ఎవరూ గుర్తించలేదు. అదే భగవంతునిలీల! ఎంతోమంది గూఢచారులు వున్నారు అయితేనేం?" అన్నారు బాబూజీ మహారాజ్.



ఈ విషయం భర్త అయిన భోజరాజుకి తెలిసింది. శత్రువైన అక్బర్ మన రాజ్యంలోకి వచ్చి సురక్షితంగా బయటపడ్డాడు. దీనికి తన భార్యయే కారణమని మీరా దగ్గరకు వచ్చి "నీకీ ఇంట్లో స్థానంలేదు. నదిలోకి దూకి చావు" అని ఆజ్ఞాపించాడు. భర్త ఆజ్ఞ పాటించటం పతివ్రత ధర్మం అని మీరా నదిలో దూకింది. కాని ఆమెను ఎవరో ఆపివేశారు. చూస్తే గిరిధరగోపాలుడు! మీరా స్థంభించి పోయింది!

"నన్ను బృందావనంలో దర్శించు! నీభర్తతో నీకు బంధం తెగిపోయింది. రా!" అని అదృశ్యమయ్యాడు. భర్త తమ్ముడైన విక్రమసింహుడు మీరా భక్తిని కొనసాగనివ్వలేదు. ఆమె బయటకు రాకుండా ఎన్నో ఆంక్షలు పెట్టాడు.

శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతులు శ్రీమాతాజీవారు తాము పాల్గొన్న అనేక సత్సంగ సమావేశాలలో మీరాతల్లి భక్తితత్త్వాన్ని మీరా కీర్తనలను తన్మయత్వంతో సంకీర్తన చేస్తూ, ఆకీర్తనలలోని అర్థాన్ని, అందులో ఇమిడిఉన్న ప్రేమతత్త్వాన్ని తేలికగా అర్థమయ్యేటట్లు భక్తులకు బోధ

పరుస్తూవచ్చారు. వారి గాన మాధుర్యానికి తన్మయులైన పరమహంస పరివ్రాజకాచార్య పూజ్యపాద శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానందగిరి స్వాముల వారు, శ్రీవ్యాసాశ్రమ పీఠాధిపతులు శ్రీమాతాజీ వారిని రెండు వేర్వేరు సందర్భాలలో- "అభినవ మీరా", "బంగారు తల్లి" అనే బిరుదులను ఇచ్చి సత్కరించారు.

శ్రీ మాతాజీవారు గానంచేసి భక్తులను మైమరపింప జేసిన కొన్ని కీర్తనలు-

రామ్‌నామ్ రస్ పీజై , మనువా రామ్ నామ్ రస్ పీజై ॥
తజ కుసంగ్ సత్‌సంగ్ బైఠి నిత్ హరి చరిచా సున్‌లీజై ॥
కామ్ క్రోధ్ మద్ లోభ్ మోహకో బహా చిత్తసే దీజై ।
మీరాకే ప్రభు గిరిధర్ నాగర్ తాహికె రంగ్‌మె భీజై ॥

"ఓ మనసా! రామనామరసాన్ని త్రాగు. చెడ్డవారితో స్నేహాన్ని మాని సజ్జన సాంగత్యం చెయ్యి. సత్పురుషులతో కూడి హరిని గురించిన సద్విషయాలను విను. హరికథా శ్రవణం చెయ్యి . కామం, క్రోధం, మదం, లోభ మోహాలను మనస్సులో నుండి పారద్రోలు. హరి నామామృతంలో ఓలలాడు!

పాయోజీ మైనే రామ రతన్ ధన్ పాయో ।
బస్తు అమోలక్ దీమ్హారె సద్గురు, కిరిపా కరి అప్‌నాయో ॥
జనమ జనమ కీ పూంజీ పాయీ, జగ్‌మే సభీ ఖోఆయో।
ఖరచే నహీ చోర్ న లేవై దిన్ దిన్ బఢత సవాయో ॥
సత్‌కీ నావ్ ఖేవటియా సద్గురు భవసాగర్ తరి ఆయో।
మీరా కే ప్రభు గిరిధర్‌నాగర్, హరఖ్ ఉరఖ్ జస్ గాయో ॥

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL